హుడా కాలనీలో డ్రైనేజీ వార్

- ఓయూ కాలనీ పైపులు హుడా కాలనీ డ్రైనేజీలో కలపబోయిన అధికారులు
- అడ్డుకొని నిరసన వ్యక్తం చేసిన హుడా కాలనీవాసులు
- పనులు నిలిపేసిన అధికారులు



డ్రైనేజీ పనులను అడ్డుకున్న హుడా కాలనీ వాసులు

మణికొండ: వేరే కాలనీ వరద, మురుగునీరు తమ కాలనీలోని డ్రైనేజీలో కలపవద్దంటూ హుడా కాలనీవాసులు ఆందోళనకు దిగారు... చిన్నగా ఉన్న తమ కాలనీ డ్రైనేజీ పైపుల్లోకి పెద్ద పైపులను తెచ్చి కలిపితే వర్షం కురిసినప్పుడు ఆ నీరంతా తమ గృహాల్లోకి వస్తాయని వారు వాదించారు. వివరాలు... హైదరాబాద్ జిల్లా పరిధిలోని ఓయూ కాలనీలోని మురుగు, వరద నీరు రంగారెడ్డి జిల్లా, మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని హుడా కాలనీలోకి మళ్లించేందుకు బుధవారం పైప్‌లైన్ పనులను జీహెచ్ఎంసీ అధికారులు చేపట్టారు. దాంతో హుడా కాలనీ వాసులు అక్కడకు చేరుకుని ఇప్పటికే సరిగా డ్రైనేజీ నీరుపోక తాము ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఇప్పుడు మూడు అడుగుల పెద్ద పైప్‌లైన్ తెచ్చి రెండు అడుగుల పైప్‌లోకి ఎలా కలుపుతారని పనులను అడ్డుకున్నారు. వీరికి మద్దతు తెలుపుతూ ఆల్ కాలనీస్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి వి.ఆంజనేయులు ఆధ్వర్యంలో ఇతర కాలనీల వాసులు ఆందోళనకు దిగారు. ఓయూ కాలనీ నీటిని హుడా కాలనీ డ్రైనేజీలో కలపకుండా పక్క నుంచి ప్రత్యేక పైప్‌లైన్ వేసుకోవాలని, లేదంటే పనులు చేయనివ్వబోమని భీష్మించారు.

చర్చలతో పనులు నిలిపిన అధికారులు...

విషయం తెలుసుకున్న మణికొండ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ కె. నరేందర్‌రెడ్డి, హుడా కాలనీ కౌన్సిలర్ ఎల్.వందననగేష్, బీఆర్ఎస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కె.రామకృష్ణారెడ్డి, షేక్‌పేట డివిజన్ కార్పొరేటర్ తరాజుద్దీన్ అక్కడకు చేరుకున్నారు. ఇరు కాలనీల వారితో చర్చలు జరిపారు. ఎట్టకేలకు వేరుగా పైప్‌లైన్ వేసుకుంటామని, ప్రస్తుతం నిధులు ఉన్నంత వరకు వేస్తామని, మిగతా నిధులను మంజూరు చేయించుకుని పూర్తి చేస్తామని తెలపటంతో ఇరు కాలనీల వాసులు శాంతించారు. ఓ దశలో మణికొండవాసులు, ఓయూ కాలనీ వైపు రాకుండా గోడ పెడతామని షేక్‌పేట కార్పొరేటర్ తరాజుద్దీన్ అనడంతో హుడా కాలనీ వాసులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మణికొండ మున్సిపల్ డీఈ దివ్యజ్యోతి, కౌన్సిలర్ వసంతరావు, హుడాకాలనీ, ఓయు కాలనీ కార్యవర్గ నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

పరమేశ్వరికి జిల్లా కలెక్టర్ ప్రశంస


జిల్లా వైద్యాధికారి చేతుల మీదుగా ప్రశంస పత్రాన్ని అందుకున్న పరమేశ్వరి

శంషాబాద్ : టీబీ, కేన్సర్ రోగులకు చేస్తున్న సేవలకుగాను పట్టణంలోని ఆర్‌బీనగర్ కాలనీకి చెందిన త్రినేత్ర ఫౌండేషన్ చైర్‌పర్సన్ మడపతి పరమేశ్వరిని జిల్లా కలెక్టర్ హరీష్ ప్రశంసించారు. కొన్ని నెలుగా త్రినేత్ర ఫౌండేషన్ ద్వారా పదుల సంఖ్యలో టీబీ, కేన్సర్ రోగులకు నెలవారి పౌష్టికాహారం కిట్ల పంపిణీతో పాటు మందులను అందజేస్తున్నారు. ఈ సేవలను జిల్లా వైద్యశాఖ గుర్తించి కలెక్టర్‌కు నివేదించడంతో జిల్లా కలెక్టర్ ప్రత్యేక ప్రశంస పత్రాన్ని జారీ చేయడంతో దానిని జిల్లా వైద్యాధికారి బి. వెంకటేశ్వర్‌రావు చేతుల మీదుగా బుధవారం అందజేశారు.

'బీఆర్ఎస్, బీజేపీలకు కాలం చెల్లింది'


జ్ఞానేశ్వర్ ముదిరాజ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన యువకులు

శంషాబాద్ కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని బీఆర్ఎస్ ప్రభుత్వాలు పాలనలో పూర్తిగా వైఫల్యం చెందడంతో ఆ పార్టీలకు ఇక కాలం చెల్లిందని పీసీసీ ప్రధాన కార్యదర్శి బొర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్ అన్నారు. బుధవారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు పి. సంజయ్‌యాదవ్ ఆధ్వర్యంలో సూరజ్‌గార్డెన్స్‌తదితర బస్తీలకు చెందిన యువత పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాజేంద్రనగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ విజయఢంకా మోగించడం ఖాయమన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు శేఖర్ యాదవ్, పట్టణ ఉపాధ్యక్షుడు జహంగీర్ పాషా, ప్రధాన కార్యదర్శి పి. శ్రీధర్‌యాదవ్, కోటీశ్వర్‌గౌడ్, శంషుద్దీన్, జాకిర్, నవీన్, ఖలీద్, ఫక్రుద్దీన్, కృష్ణారెడ్డి,ప్రభాకర్ , అభిషేక్ యాదవ్ పాల్గొన్నారు.

భారీ మండపాల ఏర్పాటు


మండపానికి చేరిన గణనాథుడు

రాజేంద్రనగర్: గణేష్ నవరాత్రుల సందర్భంగా రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో మండపాల నిర్వాహకులు గణనాథులను ప్రతిష్ఠించేందుకు భారీ మండపాలను ఏర్పాటు చేస్తున్నారు. రంగు రంగుల విద్యుత్ దీపాలతో పాటు వివిధ రకాల వస్త్రాలతో మండపాలను అందంగా అలంకరిస్తున్నారు. సర్కిల్ పరిధిలోని అత్తాపూర్, రాజేంద్రనగర్, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ల పరిధిలో దాదాపు 550 మండపాలను ఏర్పాటు చేస్తున్నారు. మండపాల్లో గణనాథులను ప్రతిష్ఠించి పూజలు చేసి నిమజ్జనానికి తరలించనున్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యను సీఎంకు విన్నవించండి


హోంమంత్రికి వినతి పత్రం అందజేస్తున్న మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు

శంషాబాద్: ఏళ్లుగా అరకొర జీతాలతో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికుల డిమాండ్లను ముఖ్యమంత్రికి విన్నవించి పరిష్కరించేలా చూడాలని మున్సిపల్‌కార్మికులు హోంమంత్రి మహమూద్ అలీకి విన్నవించారు. మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యుడు అస్లాం ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికుల సంఘం జిల్లా సలహాదారు డి.నగేష్,యాదగిరి, ప్రవీణ్ తదితరులు హోంమంత్రిని కలిశారు. మున్సిపాలిటీలో వివిధ కేటగిరీల్లో తక్కువ వేతనాలతో పని చేస్తున్న వారి ఉద్యోగాలను క్రమబద్ధీకరిస్తానని గతంలో ముఖ్యమంత్రి కేసీఆర్ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. తమ సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేయాలని కోరారు.

ముగిసిన వర్క్‌షాప్

రాయదుర్గం: ఉర్దూ విశ్వవిద్యాలయంలో నాలుగురోజులపాటు నిర్వహించిన అంతర్జాతీయ వర్క్‌షాప్, ఖగోళ శాస్త్ర డేటా విశ్లేషణ కార్యక్రమం బుధవారం ముగిసింది. ఉర్దూ విశ్వవిద్యాలయంలోని ఫిజిక్స్, మ్యాథమెటిక్స్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. క్యాంపస్ లోని లైబ్రరీ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ అధ్యక్షత వహించి ఈ సదస్సు ప్రాధాన్యతను వివరించారు.

ప్రభుత్వ స్థలంలో పార్కు, కమ్యూనిటీ హాల్ నిర్మించాలని వినతి


ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ చంద్రశేఖర్ తదితరులు

బండ్లగూడ: గంధంగూడ బృందావన్ కాలనీలోని ప్రభుత్వ స్థలంలో పార్కు, కమ్యూనిటీహాల్ నిర్మించాలని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్‌ను బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ 1వ డివిజన్ కార్పొరేటర్ తలారి చంద్రశేఖర్, గంధంగూడ వాసులు కోరారు. బుధవారం వారు ఎమ్మెల్యేను కలిసి ఈ మేరకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ, కార్పొరేషన్ పరిధిలోని గంధంగూడ సర్వే నం. 86లోని ప్రభుత్వ స్థలం ఖాళీగా ఉందని, ఇక్కడ పార్కు, కమ్యూనిటీ హాల్ నిర్మిస్తే ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. తమ విజ్ఞప్తికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని, త్వరలోనే తగు చర్యలు తీసుకంటామని హామీ ఇచ్చారన్నారు. ఎమ్మెల్యేను కలిసి వారిలో బంగారు మైసమ్మ ఆలయ చైర్మన్ తలారి ప్రేమ్‌కుమార్, మాజీ అధ్యక్షుడు యామిని జంగయ్య, ప్రధాన కార్యదర్శి, మాజీ ప్రధాన కార్యదరి ఆంజనేయులు, రఘు, శ్రీకాంత్‌చారి, కమల్, ప్రభాకర్, పాల్, రతన్, రాజు, సమ్మయ్య, అంజయ్య, రమేష్, శ్రీకాంత్, దస్తగిరి తదితరులు ఉన్నారు.

గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి


పత్తికుంట వద్ద నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీసీ రవికుమార్ తదితరులు

రాజేంద్రనగర్: గణేష్ ఉత్సవాలను నిర్వహించుకునే భక్తులకు ఇబ్బందులు కలగకుండా తగు చర్యలు తీసుకుంటున్నామని రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రవికుమార్ అన్నారు. రాజేంద్రనగర్ పత్తికుంట వద్ద గణేష్ నిమజ్జన ఏర్పాట్లను గురువారం వివిధ విభాగాల అధికారులు, సిబ్బందితో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డీసీ మాట్లాడుతూ, ప్రజలు గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో వైభవంగా జరుపుకోవాలన్నారు. మండపాల వద్ద నిర్వాహకులు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూసుకోవాలన్నారు. రాజేంద్రనగర్ పత్తికుంట వద్ద నిమజ్జనానికి భారీ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే గణనాథులను నిమజ్జనం చేసేందుకు క్రేన్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి, సీఐ నాగేందర్‌బాబు, గణేష్ ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్, ఉపాధ్యక్షుడు నారగూడెం మల్లారెడ్డి, పోన్నమోని మల్లేష్‌యాదవ్, సత్యనారాయణ, జి.బాబూరావు, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల పట్టాలు అందించాలి


ఆర్డీఓకు సమస్యను వివరిస్తున్న మజ్లిస్ పార్టీ అధ్యక్షుడు షేక్ రియాజ్ తదితరులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని హనుమాన్‌నగర్, జలాల్‌బాబానగర్ ప్రాంతంలో నివసిస్తున్న వారందరికీ ఇళ్ల పట్టాలను అందించేందుకు కృషి చేస్తున్నట్లు రాజేంద్రనగర్ డివిజన్ మజ్లిస్ పార్టీ అధ్యక్షుడు షేక్ రియాజ్ వెల్లడించారు. బుధవారం జలాల్‌బాబానగర్, హనుమాన్‌నగర్ వాసులతో పాటు మజ్లిస్ పార్టీ నాయకులతో కలిసి ఆయన ఆర్డీఓను కలిశారు. అనంతరం మాట్లాడుతూ , నిరుపేద కుటుంబాలకు చెందిన వారు దశాబ్దాలుగా హనుమాన్‌నగర్, జలాల్‌బాబానగర్ ఇళ్లు నిర్మించుకొని నివసిస్తున్నారన్నారు. వారికి నేటికీ ప్రభుత్వం ఎలాంటి పట్టాలు అందించలేదన్నారు. జీఓ 58,59 కింద దరఖాస్తు చేసుకున్నా ఎలాంటి ప్రయోజనం లేకుండాపోయిందన్నారు. ఇదే విషయాన్ని తాను మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ, ఎమ్మెల్సీ రహమత్‌బేగ్ దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు. వారి ఆదేశం మేరకు లబ్ధిదారులందరికీ పట్టాలు ఇప్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ ఫైజల్,దశరథ్, వెంకటేష్, ఎండి ఇర్ఫాన్ తదితరులున్నారు.

పరిసరాల శుభ్రతలో ప్రజల భాగస్వామ్యం అవసరం


జవాన్లు, డ్రైవర్ల హాజరును పరిశీలిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: పరిసరాల పరిశుభ్రతలో ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర అన్నారు. బుధవారం ఉదయం 5 గంటలకు శానిటరీ జవాన్ల, డ్రైవర్ల, కార్మికుల హాజరును ఆయన తనిఖీ చేశారు. అనంతరం వారికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా కమిషనర్ శరత్ చంద్ర మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ కష్టపడి పని చేయాలన్నారు. చెత్తాచెదారం పేరుకుపోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. చెత్త రహిత బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్‌గా తీర్చిదిద్దాలన్నారు. స్వీపర్ల అటెండెన్స్‌ను బండ్లగూడ జాగీరు వార్డు కార్యాలయంలో, హైదర్షాకోట్ వార్డు కార్యాలయంలో పరిశీలించి పలు సూచనలు చేశారు. జేఏస్‌ఆర్‌ఎంయూ కాలనీలో శానిటేషన్ డ్రైవ్‌ను పరిశీలించారు. మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ రవి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేష్, శానిటరీ జవాన్లు, డ్రైవర్లు, స్వీపర్లు, కమాటీలు పాల్గొన్నారు.

మండపాలకు విద్యుత్ కనెక్షన్‌కు దరఖాస్తు చేసుకోండి: డీఈ

రాజేంద్రనగర్: గణేష్ మండపాల నిర్వాహకులు తాత్కాలిక విద్యుత్ కనెక్షన్ కోసం రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని శివరాంపల్లిలోని విద్యుత్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని విద్యుత్ డివిజనల్ ఇంజినీర్ పి.రత్నాకర్‌రావు అన్నారు. ఈ నెల 18 నుంచి 28వ తేదీ వరకు జరగనున్న వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గణేష్ మండపాలకు విద్యుత్‌సరఫరా చేసేందుకు ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకున్నారన్నారు. విద్యుత్ ప్రమాదాలతో పాటు సరఫరాలో అసౌకర్యాన్ని నివారించడానికి మండపాలకు ప్రత్యేక కనెక్షన్లు ఇవ్వనున్నట్టు తెలిపారు. 250 వాట్ల విద్యుత్ కనెక్షన్ కోసం రూ. 500, 2005 నుంచి 500 వాట్ల వరకు రూ.1000, 500 పైచిలుకు వాట్ల వరకు రూ. 1500 రుసుము చెల్లించాలని డీఈ అన్నారు. వెయ్యి వాట్లపై చిలుకు విద్యుత్ వినియోగించేవారు అదనంగా ప్రతి 500 వాట్ల వరకు 750 రూపాయలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. మండపాల నిర్వాహకులు ఎవ్వరూ తొందరపడి అక్రమ కనెక్షన్లు తీసుకొని ప్రమాదాలు జరిగేందుకు ఆస్కారం ఇవ్వడంతో పాటు విద్యుత్ సంస్థకు నష్టం చేకూర్చవద్దని డీఈ రత్నాకర్‌రావు కోరారు.

భర్త వేధిస్తున్నాడని పోలీసులకు ఫిర్యాదు

శంషాబాద్ రూరల్: తనను తరచూ వేధింపులకు గురిచేస్తున్న భర్తపై చర్యలు తీసుకోవాలని ఓ మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసుల కథనం ప్రకారం... మండలంలోని పెద్దగోల్కొండకు చెందిన జ్యోతికి కందుకూరు మండలం పూలిమామిడి నివాసి జంగయ్యతో 2008లో వివాహం జరిగింది. వీరికి కొడుకు, కూతురు సంతానం. జ్యోతికి 2009లో ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా ఉద్యోగం వచ్చింది. అప్పటి నుంచి ఆమె బ్యాంకు ఏటీఎం కార్డును భర్త జంగయ్య తన వద్ద పెట్టుకుని జీతం డబ్బులు ఖర్చు చేసుకునేవాడు. వేరే మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని తరచూ భార్యను వేధిస్తున్నాడు. ఈ క్రమంలో పలుసార్లు పెద్దల సమక్షంలో పంచాయితీ జరిగింది. కొన్ని రోజుల కిందట పెద్దగోల్కొండలో జ్యోతి,జంగయ్య దంపతులు కాపురం పెట్టారు. ఆగస్టు 24న భర్తతో గొడవ జరగడంతో జ్యోతి అదే గ్రామంలోని తల్లి ఇంటికి వెళ్లింది. దీంతో అదే రోజు రాత్రి జంగయ్య ఇంట్లోని సామాన్లు తీసుకుని భార్యకు చెప్పకుండా వెళ్లిపోయాడు. అప్పటి నుంచి అతడి నుంచి ఎలాంటి కబురు లేకపోవడంతో బాధితురాలు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హెచ్‌సీయూ ప్రొఫెసర్లకు 'ఐఎన్ఎస్ఏ' అవార్డులు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ మాజీ వీసీ అప్పారావు పొదిలే, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం ముత్తమిలరసన్‌లను 'ఐఎన్ఎస్ఏ' సత్కారం లభించింది. ప్రొఫెసర్ అప్పారావు, ప్రొఫెసర్ డాక్టర్ ఎం ముత్తమిలరసన్ ఐఎన్ఎస్ఏ విశిష్ట ఉపన్యాస అవార్డుకు ఎంపికయ్యారు. ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ (ఐఎన్ఎస్ఏ) నుంచి 2023 సంవత్సరానికి ఐఎన్ఎస్ఏ అసోసియేట్ ఫెలోషిప్‌కు ఎంపిక కావడం విశేషం. వీరిని హెచ్‌సీయూ ప్రొఫెసర్లు, ఫ్యాకల్టీ, అధికారులు అభినందించారు.

అత్తాపూర్ సమస్యలను త్వరగా పరిష్కరిస్తాం: ఎంపీ


ఎంపీ రంజిత్‌రెడ్డిని కలిసిన బీఆర్ఎస్ నాయకుడు మిద్దెల సురేందర్‌రెడ్డి తదితరులు

అత్తాపూర్: ప్రజలకు మెరుగైన సౌర్యాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనేక అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తోందని చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ జి.రంజిత్‌రెడ్డి అన్నారు. అత్తాపూర్ డివిజన్‌లోని సమస్యలను పరిష్కరించాలని రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు మిద్దెల సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం చేవెళ్ల ఎంపీ డాక్టర్ రంజిత్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, డివిజన్‌లోని సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామన్నారు. వెంటనే అధికారులతో చర్చించి తగు నిధులను కేటాయిస్తామన్నారు. ప్రజలకు కావాల్సిన సౌకర్యాలను కల్పించి ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో నాయకులు సురేష్ రెడ్డి, శంకర్, పీఎం రెడ్డి, హర్షిత్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, అర్జున్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎస్సీల అభివృద్ధికి వర్గీకరణ ఒక్కటే మార్గం

ఎమ్మార్పీఎస్ నేతలు


రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న నాయకులు

రాజేంద్రనగర్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎస్సీలకు ఇచ్చిన హామీని వెంటనే నేరవేర్చాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జాతీయ నాయకులు గుంటి సురేష్‌మాదిగ, వనం నర్సింహ మాదిగ డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు ఈ పార్లమెంటు సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని బుద్వేల్ డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్ష రెండవ రోజు బుధవారం కొనసాగింది. నియోజకవర్గ ఇన్‌ఛార్జి మునిరాతి అరుణ్‌కుమార్ మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ దీక్షలో సురేష్‌మాదిగ, నర్సింహ మాదిగ ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. ఎస్సీలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే వర్గీకరణ ఒక్కటే మార్గమన్నారు. బీజేపీ గతంలో ఇచ్చిన హామీ మేరకు పార్లమెంటు సమావేశాల్లో వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి ఆమోదింపచేయాలని డిమాండ్ చేశారు. దీక్షకు పలు పార్టీల నాయకులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో దుడ్డు పోచయ్య, లింగని కృష్ణమాదిగ, నాన్నగారి రామచందర్ మాదిగ, రామేశ్వరం నరేందర్ మాదిగ, మక్తగూడెం కుమార్‌మాదిగ, పాస్టర్ అరుణ్‌కుమార్, వైఎస్ఆర్‌టీపీ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి దయానంద్, మాజీ సర్పంచ్ దర్శన్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన రైతులకు పంట రుణాలు


రైతులకు రుణాల చెక్కులు పంపిణీ చేస్తున్న చైర్మన్ దౌనాకర్‌గౌడ్

శంషాబాద్ రూరల్: అర్హులైన రైతులకు పంట రుణాలు మంజూరు చేశామని చిన్నగోల్కొండ సొసైటీ చైర్మన్ దౌనాకర్‌గౌడ్ అన్నారు. బుధవారం సొసైటీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 37 మంది రైతులకు రూ.20 లక్షల పంట రుణం డబ్బును వారి ఖాతాల్లో జమ చేశామన్నారు. 9 మంది రైతులకు రూ.40 లక్షల దీర్ఘకాలిక రుణాలను మంజూరు చేశామన్నారు. సొసైటీ పరిధిలో 450 మంది రైతులకు పంట రుణాలు మాఫీ అయిందని, వారిలో తిరిగి 350 మంది రైతులకు సుమారు రూ.2 కోట్ల రుణాలు మంజూరు చేశామన్నారు. సమావేశంలో డైరెక్టర్లు దేవేందర్‌రెడ్డి, మోహన్‌రావు, ప్రశాంత్‌రెడ్డి, విజయలక్ష్మి, రూప, బాల్యానాయక్, దేవేందర్ గౌడ్, రైతులు బుర్గు లక్ష్మారెడ్డి, వట్టిల మల్లేష్, బైకని కృష్ణ పాల్గొన్నారు.

కార్పొరేటర్ సొంత నిధులతో రోడ్డు ప్యాచ్‌వర్క్


ప్యాచ్‌వర్క్ పనులు చేస్తున్న కార్మికులు

బండ్లగూడ: ప్రజలకు వసతులు కల్పించేందుకు జాప్యం లేకుండా అభివృద్ధి పనులు చేపడుతున్నామని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్ గోకరి శ్రీలత సురేష్‌గౌడ్ వెల్లడించారు. కార్పొరేషన్ పరిధిలోని అరుణోదయ కాలనీ, వీరబ్రహ్మేంద్రస్వామి కాలనీ, ఆనంద్ ఎన్‌క్లేవ్‌ల్లో తన సొంత నిధులతో రోడ్డు ప్యాచ్‌వర్క్ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కురుస్తున్న వర్షాలకు రోడ్లు గోతులమయంగా మారాయన్నారు. ప్రజలు ఈ సమస్యను తన దృష్టికి తీసుకురావడంతో తన సొంత నిధులతో సిమెంట్ మిశ్రమాన్ని తీసుకువచ్చి మరమ్మతులు చేయించామన్నారు. కార్యక్రమంలో నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటరుకు ప్రత్యేక స్థానం


కార్యక్రమంలో పాల్గొన్న డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి

అత్తాపూర్: ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటరుకు ప్రత్యేక స్థానం ఉందని, ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకొని తమకు నచ్చిన అభ్యర్థులకు ఓటు వేయాలని రాజేంద్రనగర్ డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి కోరారు. రాజేంద్రనగర్ డివిజన్ అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హసన్‌నగర్‌లో బుధవారం సాయంత్రం ఓటరు నమోదుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ, 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. ప్రలోభాలకు లొంగకుండా ప్రజలకు మేలు చేస్తాడని తాము భావించిన, తమకు నచ్చిన వ్యక్తికి ఓటు వేయాలని కోరారు. రాజేంద్రనగర్ ఏసీపీ గంగాధర్, అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్ పులి యాదగిరి, అత్తాపూర్ ఎస్సై నాగరాజు, అత్తాపూర్ ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

నిరుద్యోగ దీక్షకు భారీ సంఖ్యలో తరలివెళ్లిన నాయకులు

రాజేంద్రనగర్: నిరుద్యోగ సమస్యపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి ఇందిరా పార్కు వద్ద నిర్వహించిన 24 గంటల నిరాహార దీక్ష కార్యక్రమానికి రాజేంద్రనగర్ నియోజకవర్గం నుంచి భారీ సంఖ్యలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్, జిల్లా కార్యదర్శి ఎం.కొమురయ్య, అసెంబ్లీ కన్వీనర్ పోన్నమోని మల్లేష్‌యాదవ్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. ఉద్యోగాల ప్రకటనలు సైతం చేయలేదన్నారు. నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి మోసం చేసిందన్నారు. కాంట్రాక్టు ఉద్యోగస్తులకు ప్రభుత్వం పర్మనెంట్ చేస్తామని, ఇంటికో ఉద్యోగం ఇస్తామని ఇవ్వలేదన్నారు. గ్రూప్–1 ఎగ్జామ్‌లో అవకతవకలపై ప్రభుత్వం ఇంకా మోసం చేస్తున్నదని ఈ నేపథ్యంలోనే రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి 24 గంటల దీక్షకు శ్రీకారం చుట్టారన్నారు.

అంగన్‌వాడీ టీచర్లను వెంటనే పర్మనెంట్ చేయాలి



ధర్నాలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు, యూనియన్ సభ్యులు

రాజేంద్రనగర్: రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లను వెంటనే పర్మనెంట్ చేసి వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని టీపీసీసీ ప్రపధాన కార్యదర్శి, రాష్ట్ర ఎలక్షన్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యుడు బొర్రా జ్ఞానేశ్వర్‌ముదిరాజ్ డిమాండ్ చేశారు. అంగన్‌వాటీ టీచర్లు, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నాకు బుధవారం ఆయన మద్దతు తెలిపారు. రాజేంద్రనగర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా బొర్రా జ్ఞానేశ్వర్‌ముదిరాజ్ మాట్లాడుతూ, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే ఆమోదించాలన్నారు. రూ.26 వేల వేతనం అందించాలని, ఉద్యోగ, ఆరోగ్య భద్రత కల్పించాలని, రిటైర్‌మెంట్ తరువాత టీచర్లకు రూ. 10 లక్షలు, హెల్పర్లకు రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ అధ్యక్షుడు ధనుంజయ్, ఐఎన్‌టీయూసీ కార్యదర్శి, కాంగ్రెస్ పార్టీ ఏ–బ్లాక్ అధ్యక్షులు దప్పు నవీన్, బి–బ్లాక్ అధ్యక్షుడు ఖలీద్, బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షుడు పూలపల్లి కృష్ణారెడ్డి, సులేమాన్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు ఇస్మాయిల్, బొక్క ప్రభాకర్‌రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, అంగన్‌వాడీ సెక్టార్ లీడర్లు, టీచర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.